రించింది. అంత సంతోషంలో ఆ అమ్మాయి లెవరో - ఎక్కడివారో - ముఖ్యంగా ఆ అందమైన అమ్మాయి ఎవరో అన్న సందేహాలకి జవాబుదొర్కక కాస్త నిరుత్సాహ పడ్డాను.

— ఆ తరువాత నెల రోజులు కనిపించిన ప్రతి ఆడపిల్లవంక చూసేవాడిని ఆశగా, ఆరాటంగా ఆ అందమైన అమ్మాయికోసం - రోజులో ఏదో క్షణం ఆమె గుర్తురాక మానేది కాదు. ఆఖరికి నా మొర భగవంతుడు ఆలకించాడు. ఆ రాత్రి సర్జన్‌తో వార్డు డ్యూటీలో వున్నాను.క్యాజువాలిటీ నించి ఎమర్జెన్సీ అపెండిసైటిస్ కేసు వచ్చింది- పేషంటుని అపస్మారక స్థితిలో మోసుకు వచ్చారు. ఆ కేసు ఎవరో గాదు- నా దేవకన్యే - ఒక్క క్షణం కర్తవ్య విమూడిడిలా నిలబడిపోయాను- ఆ క్షణంలో ఆ అమ్మాయి ప్రమాద పరిస్థితికి కల్గిన ఆందోళన కంటె తిరిగి ఆమె ఈ విధంగా కన్పించిన ఆనందం ఎక్కువైంది। ఆ తరువాత చకచకపరిక్షలు,సర్జన్‌కి ఫోను-ఆపరేషన్ థియేటర్ రెడీ చెయ్యడం అంతా యాంత్రికంగా జరిగిపోయింది. ఆ అమ్మాయిని తీసుకువచ్చిన యిద్దరు మిత్రురాండ్రు యిచ్చిన సమాచారం, ఆ అమ్మాయి ఉనికిని తెలియపరిచింది. ఆమె పేరు రజియా - ఉమెన్స్ కాలేజిలో బి. ఎస్సీ చదువుతూంది. హాస్టలు నచ్చక ఒకే వూరి వారయిన ఆ ముగ్గురు అమ్మాయిలూ కలిసి ఓ చిన్నయిల్లు అద్దెకు తీసుకున్నారు-ఇదివరకు అప్పుడప్పుడు కడుపు నొప్పివస్తే ఏదో అనుకున్నారు.

ఇవాళ ఉదయంనించి కడుపునొప్పి-వాంతులతో బాధపడింది. అజీర్ణం అనుకుందట-సాయంత్రంనించి జ్వరం మొదలై రాత్రి అయ్యేసరికి వంటిమీద తెలివి లేని స్థితిలో పడగానే ఆ ఇద్దరమ్మాయిలు గాభరాపడి ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ కథవిని అంత నిర్లక్ష్యంగా ఆలశ్యం చేసినందుకు మందలించాను. ఆ అమ్మాయిలు ఇద్దరూ అక్కడ హౌస్ సర్జన్‌గా ఎదురైన నన్నుచూసి చాలా ఆశ్చర్యపోయి మొహాలు చూసుకున్నారు. నన్ను గుర్తించి సిగ్గుగా నవ్వుకుని కళ్ళతో మాట్లాడు కోడం నా కంటబడకపోలేదు.

ఆపరేషన్ చేస్తున్నంతసేపు నా మనసు నా మనసులో లేదు. యాంత్రికంగా బాస్‌కి అసిస్టు చేస్తున్నా నా ఆలోచనలు, నా దృష్టి అంతా రజియామీదే- రజియా ! మనిషిలాగే పేరు అందమైనది-అందం ముస్లిమ్ వనితల సొత్తు అంటారు. నిజంగా రజియా అంత అండిగత్తె-ఆ గులాబిరంగు పల్చని పొత్తికడుపుమీద కత్తితో గాటు